
# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్‌రాజు





## -52-

## జలకాలాటలలో.... కథ

గత రెండూ, మూడేళ్ళగా ఈ దిక్కుమాలిన వయస్సు కొంచెం నా మీద కూడా పడిందేమో అనే అనుమానం ఎందుకొచ్చిందంటే...ఇది వరకూ నన్ను అంకులూ, పెంకులూ అని పిలిచిన వయసు వాళ్ళు ఇప్పుడు అప్పుడప్పుడు నోరు జారి గ్రాండ్  పా అనడం అందరికీ కూడా వినపడి పోయేది కారణం అయితే, చక చకా, టకా, టకా ని కేవలం ఫీలింగ్ కోసం అనేసుకుంటూ నాలుగు అడుగులు వెయ్యగానే నడుమూ, పిక్కలూ కట కటా అని రోదించడం నా ఒక్కడికే తెలిసిన లోపలి చెవులకి వినపడే రోదన మరొక కారణం. ఇలాంటి నడక రోగాలు ఎంత దాచాలనుకున్నా దాగనివే కాబట్టి అమెరికా ఆరోగ్య భీమా వారి ఆదేశాల ప్రకారం ముందు గుమ్మం దగ్గర కాపలాదారు డాక్టరు..అంటే ఇక్కడి పరిభాషలో ప్రైమరీ కేర్ ఫిజీషియన్ వారు....ఆయన దగ్గరకి వెళ్ళాను. దేని గురించీ పూర్తిగా తెలీదు కానీ తెలినట్టు నటిస్తూ, మన 'రోగ సోది' విని దానికి తగ్గ స్పెషలిస్ట్ దగ్గరకి పంపించడం ఈయన చేసే డాక్టరీ ఉద్యోగం అనమాట. యధావిధిగా ఆయన ముందు నా వెన్నెముక కి ఎమ్మారై చేయించాడు. నా ఎముకల గూడుని చూడగానే సంగతి కనిపెట్టే మరొక డాకటేరు చెప్పినట్టుగా రెండేళ్ళ క్రితం  మొదటి విడత చికిత్సగా నాలుగు వారాలు ఫిజికల్ థెరపీ కి వెళ్ళాను. అప్పుడు వెన్నెముకతో పాటు మిగతా ఒళ్ళంతా నొప్పులు పెరిగి చావడమే కానీ చికిత్సా లేదు, నా పిండాకూడూ లేదు. ఆ తర్వాత "నీకు వెన్నుపోటు పొడవాల్సిందే" అని మరో డాక్టర్ దగ్గరకి పంపించి వెన్నెముకలో చిన్న ఎముకల్లో అనుకుంటాను...అక్కడ మూడు విడతల్లో సూది మందు వేయించాడు. నిజానికి మనకి మత్తు మందు ఇచ్చాడు కాబట్టి ఈ డాక్టర్ అసలు ఏమన్నా చిన్న సూదితో పొడిచాడో, ఏకంగా పెద్ద దబ్బనంతోటే పొడిచాడో  లేదో అనుమానమే. ఎందుకంటే మన నడక నొప్పి వీసమంత తగ్గకపోగా ఎక్కువ అయిందేమో అని నా అనుమానం. ఈ ఆట అయ్యాక ముచ్చటగా మూడో సారి ఏకంగా నా వెన్నెముక అట్టడుగున ఉన్న చిన్న ఎముక నెంబర్ 4 మరియు నెంబర్ 5...వీటిని లంబర్ ఎముకలు అంటారుట...ఎముక. ఎలకా...ఏమంటే మనకెందుకూ...అవి పక్కనే అమాయకంగా మెదడు వేపు వెళ్ళి తన పని తను చేసుకుంటున్న పెద్దా, చిన్నా నరాలని తాకబట్టి ఈ నొప్పులు వస్తున్నాయి కావున వాటిని కత్తితో కాస్త గీకేస్తే సరి పోతుంది


అని మరొక సలహా. ఎలాగా మత్తు మందు ఇస్తారుగా అని దానికి కూడా ఒప్పేసుకుని ఆ సర్జరీ కూడా చేయించేసుకుని ఇక ఒలింపిక్స్ లో పరిగెట్టడానికి తయారు అయ్యాను. కానీ దాం దుంపతెగ....ఓ వారం, పదిరోజులు నడక చక చకా స్థాయికి వచ్చాక మళ్ళీ ఎక్కడి గొంగళీ అక్కడే.

ఈ తతంగం కూడా అయ్యాక ఒక సారి రోటరీ క్లబ్ సమా'వేషా'నికి వెళ్ళినప్పుడు ఒకానొక స్టీవ్ హేరిస్ ..కమలతో చుట్టరికం లేదుట....నా వయస్సు వాడే అతడిని కలిసి....నేనేదో మాటల సందర్భం లో నా నల్లేరు నడక గురించి చెప్పగానే "చెప్పావు కాదేం. రేపు మధ్యాహ్నం మా క్లినిక్ కి వచ్చెయ్...నీ మెడ, వెన్నెముక అన్నీ సరిచేస్తాను" అన్నాడు. ఆ మానవుడు మా టెక్సస్ లో ఎంతో పేరున్న...కీరోప్రాక్టర్....అనగా తెలుగు లో నాకు తెలియదు కానీ అదేమిటో చూద్దాం అని వెళ్ళాను. ఇక చూసుకోండి నా రంగా....మరో మూడు నెల పాటు వారానికి రెండు రోజులు లాగుడూ, బాదుడూ. అంటే ముందు ఒక బల్ల మీద పడుకోబెట్టి మెడలో పటకాలు వేసి పావు గంట మెడ సాగదీయడం. తర్వాత పొట్టమీద పడుకోబెట్టి సుత్తి తో వెన్నెముకకి అటూ, ఇటూ దబ, దబా బాదడం, ఇది మన ఒరియా ఓఢ్రం మంగలి పద్ధతికి అమెరికనైజ్డ్ పద్ధతి అనమాట...ఆ బాదుడు చాలక ఆధునికంగా ఉండడానికి ఒక లేజర్. మరొక ఎలెక్ట్రికల్ మసాజ్ అనే గోకుడు అన్నీ రంగరించి స్టీవ్ హేరిస్ గారు పదివేల డాలర్ల ఆట ఆడుకున్నారు. ఈ సారి కూడా ఓటమి మనదే...అనగా...ఈ నడుము, మెడ, పిక్కలు వగైరా ఎక్కడ ఏ విధమైన నొప్పి కలిగిననూ...దానికి మందూ, మాకూ...మందు అనగా మాత్రలు, మాకు అనగా కత్తి తో కోతలు ఏమీ పని చెయ్యవు...కానీ డాక్టర్లు ఆడుకోడానికి నా లాంటి వాడు దొరకగానే "బాబూ, ఇది వయసు తో వచ్చిన పరిస్థితి. ఈ జన్మకి ఇది ఇంతే...ఇది తగ్గదు కాక తగ్గదు" అని మానవ శరీర ధర్మం గురించి చెప్పి చావరు. దీనికి 'నీ వెన్నెముక క్షీణించింది' లేదా "నీకు వెన్నుపూసలు తుప్పు పట్టాయి" లాంటి అచ్చ తెలుగులో అనక చెప్తే "హోరి నాయనోయ్" అని హడిలి చస్తాం కానీ "నీకు స్పైనల్ స్టెనోసిస్ నాయనా.." అని ఆంగ్లం లో సొగసుగా చెప్తే 'నలుగురి తో పాటు నారాయణ" అని అదో రకం శునకానందం కలుగుతుంది. ఇంతకీ ఇంత దాకా చెప్పినది అసలు కథకి ఉపోద్ఘాతం మాత్రమే. పాఠకులలో కొంత మందికి ఇది చదివి 'డెజావూ ఆల ఓవర్ ఎగైన్' అనే అనుమానం వస్తే వారి మాట కొంత మటుకు నిజమే...ఎందుకంటే ఎప్పుడో, అప్పుడెప్పుడో నేను ఈ కాళ్ళ నొప్పుల మీద పోరాటం మొదలుపెట్టినప్పుడు ఒక సారి ఇలాంటి గోడు కాస్త పంచుకున్నాను. అది ఇప్పుడు గుర్తు చేసుకున్న వారి జ్ఞాపక శక్తికి జేజేలు.

ఈ భూప్రపంచంలో....అందునా అమెరికాలో ఇలాంటి నడక ఇబ్బంది వచ్చింది నా ఒక్కడికే కాదుగా. నాకంటే కుర్రకారుల్లోనూ, పెద్దకారుల్లోనూ కనీసం కొందరికైనా ఇలాంటి ఈతి బాధలు వచ్చే ఉంటాయి కదా!. మా కాపలా దారు డాక్టరూ, నరాల డాక్టరూ, వెన్నెముక డాక్టరూ, ఓఢ్రం మంగలి డాక్టరూ..వెన్నుపూసల మధ్య ఏదో అంజనం రాసే డాకటేరూ, ఇక ఏకంగా ఆ సదరు వెన్ను పూసలనే గీకేసి, గోకేసి సైజు తగ్గించేసి పక్కన పెద్ద నాడిని రాసుకుని, పూసుకుని

నొప్పెట్టకుండా చేసే శస్త్ర చికిత్స డాక్టరూ...ఎవరి పని వారు చేసినా నా పని మటుకు వారికి డబ్బివ్వడమే...అసలు నొప్పులలో పెద్ద మార్పు ఏమీ లేదు. భరించెయ్యడమే. నడుం మీద నొప్పి, మొహం లో చిరు నవ్వూ...

ఇలాంటి సమయంలో మొన్న ఒక రోజు మా స్థానిక పత్రిక లో "మీకు నడుం నొప్పిగా ఉందా? అయితే మా ఏక్వాటిక్ థెరపీ మీకోసమే" చిన్న ప్రకటన చూశాను. అంటే ఏమిటో అని అది పూర్తిగా చదివగానే నాకు అర్థం అయిన విషయం ఏమిటంటే మా పొలంలో వీర్రాజు కొడుకు సర్రాజు గాడు గౌడు గేదెలని కాలవలో నుంచోబెట్టి బురద కడిగేసినట్టు మనల్ని కూడా అందమైన నీలం రంగు నీళ్లలో నుంచోబెట్టి మన చేత నేల మీద మనం చెయ్య లేని వ్యాయామం అంతా సునాయాసంగా చేయిస్తారుట. ఒళ్ళంతా కడుగుతారో లేదో ఆ పేపర్లో రాయ లేదు. వెళ్ళి తెలుసుకోవాల్సిందే అని భలే ఆశ పుట్టింది కానీ మా క్వీన్ విక్టోరియాకి తెలిస్తే కొంప ములుగుతుంది కాబట్టి ఆ ఊసు ఎత్తకుండా జాగ్రత్త పడ్డాను. నాకు కాస్తో, కూస్తో ఈత వచ్చును కాబట్టి ఆ వంక పెట్టి "ఈ రాయి కూడా విసురుదాం. ఏమో ఏ పుట్టలో ఏ పాము ఉందో" అని అక్కడికి వెళ్ళి, ముందు వాళ్ళిచ్చిన కాయితాలు నింపాను...అంటే మా ముత్తాత గారి నుంచీ మా వంశపారంపర్యంగా వస్తున్న రోగాలు, నేను స్వయంకృషితో తెచ్చి పెట్టుకున్న వ్యాధులూ...రోజూ తినే ఘన పదార్థాలూ మరియు తాగే ద్రవ పదార్థాల పట్టికా ..ఇలాంటివనమాట... ఇవి వాళ్ళు ఎలాగా చదవరు కాబట్టి నా నోటికొచ్చిన వన్నీ రాసి పారేశాను అన్నది మనలో మనమాట అనమాట. ఇదంతా అయ్యాక ఒక అమ్మాయి "ఇవాల్యువేషన్" అనే పేరిట నన్ను శల్య పరీక్ష చేసింది. అంటే....కాస్సేపు నడిపించీ, ఏడిపించీ, పడుకోబెట్టీ, జోల పాడీ, నడ్డి విరగ్గొట్టీ, కాళ్ళు ఆడించీ, అనేక రకాల ఇతర హింసలూ పెట్టి, నా ఒళ్ళంతా టేపుతో కొలిచీ, తన ఎక్స్-రే కళ్ళ తో నా సుందర వదనారవిందం లో చూచాయగా కనపడే నొప్పి భావాలని గమనించీ మొత్తానికి ఒక రిపోర్ట్ రాసుకుంది....కానీ మనకి చూపించ లేదు....బాధించడమే కానీ చూపించుట వారి పోలిసీ కాదుట...దాని ప్రకారం నేను "ఎక్వాటిక్ థెరపీకి అన్ని విధాలుగా అర్హుడిని ట". ఆ మాట చెప్పడానికి ఇంత డ్రామా అవసరమా....నన్నడిగితే నేనే చెప్పేవాడిని కదా...అసలు మనం వచ్చిందే అందుకు కదా...



ఇక ఆ మర్నాడు....నా జలకాటలు ప్రారంభం...ఆ ఆటలు మొదలెట్టే ముందు వాల్ మార్ట్ కి వెళ్ళి ఒక నీలందీ, మరొకటి ఎరుపు దీ..'రెండు ఈత లాగు' కొనుక్కొచ్చాను.

ఈ కోవిడ్ సమయం లో ఆ వాల్ మార్ట్ వాడు ఇది వరకటి లాగా ఆ షాపు లోనే పెట్టిన "బట్టలు వేసుకుని సైజు చూసుకును గది' లోకి వెళ్ళి సరిపోయిందో లేదో చూసుకునే ఏర్పాటు లేకుండా ఆ గదులకి తాళం వేసేశాడు. అసలు కోవిడ్ కీ కొత్త బట్టలు సైజు చూసుకోడానికీ సంబంధం ఏమిటి చెప్పండి వాడి చాదస్తం కాక పోతేనూ. అంచేత ఇంటికొచ్చి వాటిల్లో ఒక పొట్టి లాగు వేసుకుని, పొట్ట మీదకి లాగి సైజు చూసుకుంటూ, కొత్త బట్టలకి మురిసిపోతూ ఉంటే మా క్వీన్ విక్టోరియా అనుకోకుండా లోపలికి వచ్చి కెవ్వున కేక పెట్టి బయటకి పరిగెట్టింది. ఆవిడ ఫోన్ తీసుకుని పోలీసులని పిలిచే లోపుగా నేను కూడా రెట్టింపు స్థాయిలో కెవ్వు కెవ్వు మని కేకలు వేసి ఆవిడ పరిగెట్టిన లివింగ్ గది లోకి వెళ్ళాను. అప్పుడు గానీ ఆవిడ నన్ను నేనే అని గమనించలేదు. తీరా చూశాక పడీ, పడీ మని ఒహాటే నవ్వు. ఇక్కడ నాకు తెలియక అడుగుతానూ, మా పెళ్ళయ్యాక ఆవిడ నన్నుఎప్పుడూ నీలం, ఎరుపు, తెలుపు ఇలా ఏ రంగు 'ఈత లాగు" లోనూ చూడలేదే అనుకుందాం. అయితే మటుకు ఇప్పుడైనా చూసి 'భలే బావున్నావోయ్ మొగుడూ" అనవలసినది పోయి ఇలా నవ్వడం ఏమన్నా బావుందా? మరీ ఎంత ఇది అయితే మటుకు అంత ఇదా?

ఈ ఉపోద్ఘాతమే చాట భారతం లా, భారీ బ్రేక్ ఫాస్ట్ లా మరీ ఎక్కువ అయిపోయింది కాబట్టి 'అసలు వంటకం' వచ్చే నెల వడ్డిస్తాను. ముందస్తు రుచి కోసం ఇక్కడ జత పరిచిన నా జలకాలాటల ఫొటో ఒకటి చూడండి. నా బోటి వాడు కేవలం ఈత కొట్టుడి కోసం కాకుండా నీటిలో యోగాసనాలు వేస్తే ఎలా ఉంటుందో తెలియాలీ అంటే...వచ్చే నెల దాకా ఆగాల్సిందే! అంత వరకూ ఓపిక పట్టండి మరి.

**COMMENTS**